
సబ్-ఇన్‌స్పెక్టర్ రమానందానికి ఒక ప్రక్క ఆనందం, మరో ప్రక్క తన సిబ్బంది మీద కోపం రెండూ కలిగాయి, బొమ్మా బొరుసులా. బీట్‌లో వున్న కానిస్టేబుల్స్‌ను, సార్జన్స్‌ను అందరినీ వెర్రి కేకలతో పిలిచాడు.

కొత్త ఎస్.ఐ. గారు కాస్త స్ట్రిక్టని తెలిసిన ఆ పోలీసు సిబ్బందికి ఏదో యిబ్బంది వచ్చినట్టూ, ఏవో కొంప లంటుకున్నట్టు బాధపడుతూ, భయపడుతూ మరియు తడబడుతూ అందరూ ఆయన ముందు సావధానంగా చేతులు కట్టుక్కొని నిలబడ్డారు.

'ఓరి వెధవల్లారా!!' అనుకొని,

"రెండు నెలల నుండి నాకు ఓ అద్దె ఇంటిని గాలించలేని మీరు నేరస్తుల్ని, దొంగల్ని ఎలా పట్టు కుంటారయ్యా? నా సర్వీసులో యిలాంటి అసమర్థత గల స్టాఫ్‌ని నేను చూడలేదు! ఈ పట్టణంలో దొంగల బెడద ఎక్కువైందని నన్ను ఎస్.పి.గారు ఏరికోరి బదిలీ చేశారు. ఆ దొంగలు కాకులుగా వున్నా, కొంగలుగా వున్నా వారికి మింగ మెతుకులు లేకుండా చేసేవరకు విశ్రమించనని శపథం చేసి మరీ వచ్చాను ఈ టౌనుకు! కానీ మీలాంటి శుంఠలతో, శునకాలతో పట్టలేనేమో! మూకుమ్మడిగా మిమ్మల్ని మూడు జిల్లాల అవతలకి బదిలీ చేయాలని ఈరోజే పైకి రాస్తాను! నా సంగతి మీకు తెలీదు. చాకిరీ చేయకుండా కాకీ బట్టలు వేసుకు న్నంత మాత్రాన సరిపోతుందనుకుంటున్నారా? ఆ బట్టల యిస్త్రీకి కూడా మేమే డబ్బులు యిస్తున్నామన్న సంగతి మరచిపోకండి. దున్నపోతులుగా బలిసి డ్యూటీ లకి వస్తే మీ ఆకారాలను చూసి నేరాలను ఒప్పుకొనేంత బలహీనులు కారు మన నేస్తాలు"




"రెండు నెలల నుండి రిక్వెస్టు చేస్తున్నాను! నాకు ఒక్క అద్దె యిల్లు మీకు దొరకలేదంటే-మీ అసమర్థతకు యింతకంటే ఏం సాక్ష్యం కావాలి?! హోటల్ తిండి నాకు పడదు. ఈ పోలీసు స్టేషన్‌లో పడుకోడానికి సరియైన స్థలం లేదు. అసలు దొంగలకే చాలడంలేదు. నేను పడుతున్న బాధల్ని మీరందరూ కళ్ళారా చూస్తూ కూడా ఇంత నిర్లక్ష్యం చేశారంటే అది క్షమించరానిది. ఏం? మాట్లాడరేం?"

వరసగా అందరూ ఒకేసారి తల దించుకున్నారు. ఇంతలో ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్‌మని ఫోను మోగింది.

"ఫోర్ ఫార్టీవన్, అది ఎక్కడ నుంచో చూడు" అన్నాడు ఎస్.ఐ.గారు తన కోపానికి కామా పడకూడ దనుకుని. కానిస్టేబిల్ ఫోను మీదకు దూకి రిసీవర్ అందుకున్నాడు.

ఎస్.ఐ.గారు తన సీరియస్‌నెస్‌ని పెంచుకోవడానికి గోల్డుఫ్లాక్ కింగ్ సైజ్ సిగరెట్‌ను నోట్లో పెట్టీ పెట్టకముందే అగ్గిపుల్ల వెలిగించాడు సార్జన్ సాహెబ్ గారు. మండి పడ్డాడు యస్.ఐ.గారు.

"నాన్‌సెన్సు! ఈ కాకాలంటే నాకు కాకర కాయంత చేదు! పైసా పని చేయకుండానే మనం మన సర్వీసుని, ప్లస్ వయసునీ పెంచుకుంటున్నాము. మీ మనస్సు ఎట్లా ఒప్పుకుంటుందో! మనకు జీతం లేకుంటే మనకు జీవితమే లేదు. ఉద్యోగమే మనకు గుర్తింపు. రిటైరు అయ్యేంతవరకూ మనం నిటారుగా నిలబడి నిస్వార్థంగా పనిచేయాలి. అదే మన ఆస్తి! అస్తిత్వం!! దీన్ని మాత్రం మర్చిపోకండి"

అని ఆయనే స్వయంగా సిగరెట్టు వెలిగించు కున్నాడు.

ఫోను వద్ద నుంచి వచ్చిన ఫోర్ ఫార్టీవన్,

"సార్! షరాబ్బజార్‌లో దొంగలు పడ్డారట, గుప్తా గారు మీరు స్టేషన్‌లో వున్నారా అని అడిగారు" అన్నాడు.

గట్టిగా దమ్ముపీల్చి "దొంగలు షరాబ్ బజార్లో పడక హరిజనవాడలో పడతారా? గుప్తాగారికి గంట తర్వాత వస్తానని ఫోను చేయండి. నేను అర్జంటుగా ఆ ఇంటి సంగతి చూడాలి!"

అని చెప్పి భయభ్రాంతులు బలవంతంగా ముఖం మీద పులుముకున్న తన సిబ్బందిని వుద్దేశిస్తూ "మీరు మన్ను తిన్న పాముల్లా కాకుండా గన్ను పట్టిన వీరుల్లా నన్ను ఫాలోకండి.

ఈ దొంగల్ని, ఈ

యస్. అజీజ్ అహ్మద్

దోషుల్ని మనుష్యులుగా మార్చేద్దాము. లేదా కాల్చి పారేసి. కాకులకు, గద్దలకు విందు చేద్దాం!!'' మందు తాగినంత ఆవేశంతో మాట్లాడాడు ఎస్.ఐ.గారు.

అది కమాండ్ కాదు కవిత్వం! అందరూ ఆశ్చర్యపోతూ ఆయన్ని విచిత్రంగా చూస్తున్నారు.

ఎస్.ఐ.గారు ఓ చిరునవ్వు నవ్వి,

''ఆ! ఒనాట్ వన్, నా బండికి పెట్రోలు కొట్టించుకని రా'' అని అతనికి డబ్బులు యిచ్చి ''మీకు ఓ శుభవార్త- మీరు చేయలేని ఓ మంచి పని, నేనే స్వయంగా సాధించాను. రాత్రి రౌండ్సు వేస్తుంటే గాంధీ నగర్‌లో ఓ మంచి యిల్లు దొరికింది! ఒంటిగంటకు ఆ ప్రాంతంలో వెళుతుంటే ఆ ఇంటి గేటుకు 'టు లెట్' అని పెద్ద బోర్డు పెట్టి వుంది. నా ఫామిలీకి సరిపడే యిల్లు, పైపెచ్చు కొత్త యిల్లు. ముందు విశాలమైన గార్డెన్సు! రాత్రే విచారిద్దామనుకున్నాను. కానీ ఆ టైములో బాగుండదని వూరుకున్నాను. ఇప్పుడేవెళ్ళి అది ఖాయం చేసుకోవాలి! అద్దె ఎంతైనా ఫర్వాలేదు. ఓ.కే! మీరు డ్యూటీలు చూసుకోండి. గుప్తాగారు వస్తే ఓ గంటలో వస్తానని చెప్పండి.''

ఎస్.ఐ.గారి సిగరెట్టు పొగలు రింగు రింగులుగా తిరుగుతూ, ఆయన ఆనందానికి సంకేతాలైనాయి!

పది నిమిషాల్లో పెట్రోలు కొట్టించుకుని బుల్లెటును తెచ్చాడు కానిస్టేబుల్. వెంటనే యిద్దరూ బయలు దేరారు గాంధినగర్ వైపు అతి వేగం తో.

రా ౦ ఎస్.ఐ.గారు చూచిన యింటి ముందు

## విప్లవవ్ః

ఎన్నెన్నో
అగ్నికణాల్ని ఆహుతిచ్చి
ఎంత ఊదినా...!
రగిలి
రాజుకోదే!

—రేణు

ఆగింది బండి. ఆ యింటి గేటుకు ''ఈ ఇల్లు అద్దెకు ఇవ్వబడును'' అని ఇంగ్లీషులో, తెలుగులోను వ్రాసిన బోర్డు తగిలించి వుంది. ఎస్.ఐ. గారితోపాటు ఆ కానిస్టేబుల్ కూడా అమిత ఆనందపడ్డాడు ఆ ఇంటిని చూచి.

ఆ ఇంట్లో ఎవరూ వుంటున్నట్టుగా కూడా లేదు. వాకిలి చిమ్మినట్టుగా కూడా లేదు. ఆ యింటి ఓనర్ ఎవరా, ఎక్కడుంటారా అనేదే వాళ్ళ అనుమానం!

ప్రక్క యింట్లోనుంచి ఓ పెద్ద మనిషి వస్తుంటే అతను ఓ దేవుడులాగా కన్పించాడు వాళ్ళకు. కాని స్టేబిల్ పరుగున అతన్ని అనుసరించి వాకబు చేశాడు. ఆ యింటి ఓనర్ ఆ యింటి వెనుకే వుంటున్నట్టు తెలిసిన కానిస్టేబిల్ గేటుపై నుండి దొంగలాగా దూకి ఆ యింటి సందుగుండా వెనక్కి పరుగెత్తాడు.

ఎస్.ఐ.గారు తాపీగా సిగరెట్టు వెలిగించి ఆ ఇంటి పరిసరాలను పరికించడంలో పడ్డాడు.

'ఎన్నాళ్ళి కీవూళ్ళో ఓ మంచి కొంప దొరికింది! రేపే వెళ్ళి ఫ్యామిలీని తీసుకొని రావాలి!!' అనుకున్నాడు గేటు తీసి లోపలికి ప్రవేశిస్తూ.

కానిస్టేబిల్‌తోపాటు ఎదురుగా వస్తున్న ఆ ఇంటి ఓనర్ సవినయంగా ఎస్.ఐ. గారికి నమస్కారం పెట్టాడు. ఆయన సంస్కారానికి ఎస్.ఐ.గారు ఐస్త్రై పోయి ప్రతి నమస్కారం కూడా పెట్టలేదు.

''ఈ బోర్డు మిమ్మల్ని కూడా ఆకర్షించినందులకు దానికి ధన్యవాదాలు! ఈ ఇల్లు అద్దెకు యివ్వబడదు!!''

''ఏమిటి మీరనేది?'' ఇద్దరూ ఒకేసారి ప్రశ్నించారు.

''ఇది నా ఇల్లే! ఇందులో నేనే వుంటున్నాను''

''మరి ఈ బోర్డు''

''అందర్నీ బోల్తా కొట్టించడానికి. ఏం చేస్తాను సార్! ప్రస్తుతం ఈ వూళ్ళో దొంగతనాలకు భయపడి ముందు ఈ బోర్డు పెట్టి దొడ్డివాకిలి గుండా మేమే కాపురం చేస్తున్నాము_రాత్రి పూట లైట్లు కూడా వేసుకోకుండా బ్లాక్ అవుట్ చేసి'' అంటున్న ఆ ఇంటి ఓనర్‌ని చూస్తుంటే- వెంటనే శల్యూట్ కొట్టాలో లేక లాఠీఛార్జీ చేయించాలో అర్థం కాలేదు ఎస్.ఐ.గార్కి.

(ఆ తర్వాత ఆ యింట్లో దొంగలు పడితే పూచి నాదిమాత్రం కాదు)

-రచయిత

